సాక్షి
అనకాపల్లి
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



వెలవెల: అనకాపల్లిలో కొనుగోలుదారులు లేక బోసిపోయిన చికెన్ దుకాణం



కిటకిట: అనకాపల్లి మెయిన్ రోడ్డులో రద్దీగా ఉన్న ఫిష్ మార్కెట్





క్యాన్సర్‌ను జయిద్దాం

సినీనటి గౌతమి

బీచ్‌రోడ్డులో విజయవంతంగా పింక్ సఖి శారీ వాక్

దేశంలో తొలిసారిగా విశాఖ వేదికగా నిర్వహణ

8లో

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

చిక్కిన చికెన్ మార్కెట్

కిటకిటలాడిన ఫిష్, మటన్ దుకాణాలు

అనకాపల్లి టౌన్: ఆదివారం చాలా ఇళ్లలో చికెన్ లేనిదే ముద్ద దిగదు. సెలవు రోజు కావడంతో మాంస ప్రియులు ఎక్కువగా ఈరోజున నాన్ వెజ్ వంటకాలతో భోంచేయడానికి ఇష్టపడతారు. ధర అందుబాటులో ఉండడంతోపాటు ప్రొటీన్లు ఎక్కువగా ఉండే కోడి కూరకే ఎక్కువమంది మొగ్గు చూపుతారు. ఆదివారం ఉదయం నుంచే కిటకిటలాడే చికెన్ దుకాణాలు ఈవారం వెలవెలబోయాయి. పక్కనున్న ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందన్న వార్తలతో అందరి మదిలో గుబులు నెలకొంది. ఉత్తరాంధ్రలో అలాంటి సూచనలేవీ లేవని వైద్యులు, అధికారులు స్పష్టం చేస్తున్నా ఈవారం మార్కెట్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చికెన్ షాపులు బోసిపోగా.. మటన్, చేపల దుకాణాల్లో రద్దీ నెలకొంది. కోడి మాంసం 190 రూపాయలకే అందుబాటులో ఉన్నా జనం కొనేందుకు జంకుతున్నారు. నిన్న, మొన్నటి వరకూ చికెన్ ప్రియులతో కళకళలాడిన షాపులు ఆదివారం వెలవెలబోయాయి. చికెన్ అమ్మకాల ప్రభావం చేపలపై పడడంతో వాటిని అధిక రేట్లకు విక్రయించారు. రొయ్యలు, జాతి చేపల కోసం ఎగబడ్డారు. సాధారణంగా కిలో రూ.800 నుంచి 900 వరకు విక్రయించే మటన్ వెయ్యి రూపాయలు పలికినా దానికే జనం మొగ్గు చూపారు.

25 శాతం అమ్మకాలతో సరి : చికెన్ దుకాణాల్లో విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. సాధారణంగా అనకాపల్లిలో ఆదివారం ఆరు, ఏడు వేల కిలోల కోడి మాంసం విక్రయిస్తారు. మిగతా రోజుల్లో నాలుగైదు వేల కిలోల వరకు అమ్ముడుపోతుంది. కానీ ఈమధ్య 25 శాతం మాత్రమే కొనుగోలు జరుగుతోందని వ్యాపారులు చెప్పారు. హోటళ్ల బేరం కూడా తగ్గిందని చికెన్ వ్యాపారి ఎస్‌కె వల్లీ తెలిపారు.

న్యూస్‌రీల్

పార్ట్‌టైం పీఈటీ అరెస్ట్

- పోక్సో కేసు నమోదు

గొలుగొండ: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన చోద్యం జెడ్పీ హైస్కూల్ మాజీ పార్టుటైం పీఈటీ కందూరు నూకరాజుపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. విద్యార్థినులతో పీఈటీ నూకరాజు అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించామని తెలిపారు. నూకరాజును విద్యాశాఖ అధికారు లు శనివారం విధుల నుంచి తొలగించగా.. ఆదివారం విచారణ అనంతరం ఆయనను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సరుగుడులో సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడేందుకు పర్యాటకులు పోటీ పడ్డారు. అనకాపల్లి, కాకినాడ జిల్లాల నలుమూలల నుంచి వాహనాలపై అధికంగా సందర్శకులు రావడంతో జలపాతం వద్ద ఉదయం నుంచి సాయంత్రం కోలాహలం కన్పించింది. ఆటపాటలతో సందర్శకులు కాలక్షేపం చేసి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సందర్శకులు పెద్ద ఎత్తున కార్లు, ద్విచక్ర వాహనాలపై రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో రద్దీ కనిపించింది.

యారాడలో 'కింగ్‌డమ్'



షూటింగ్ లొకేషన్‌లో నటుడు విజయ దేవరకొండ

కొమ్మాది: విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో పాన్ ఇండియాలో తెరకెక్కుతోన్న కింగ్‌డమ్ చిత్రం షూటింగ్ ఆదివారం యారాడ బీచ్‌లో జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు షూటింగ్ సందడి నెలకొంది. హీరో విజయ్ దేవకొండపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధిలోనూ రాజకీయమే..!

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం రోజురోజుకు పెరిగిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు వస్తే థర్డ్ పార్టీ విచారణ, క్వాలిటీ కంట్రోల్ ఎంక్వైరీ చేయాలి. అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైతే అప్పుడు నిబంధనల ప్రకారం సస్పెండ్ చేసే అధికారం ఉంటుంది. క్రిమినల్ కేసులు బనాయించడం, అక్రమంగా తొలగించడం, బెదిరింపులకు పాల్పడి వారంతట వారే రాజీనామా చేసేలా భయపెట్టడం వంటి వాటికి పాల్పడుతున్నారు. ఎక్కువమంది కూలీలు మద్దతు ఇచ్చిన వారే మేట్‌గా ఉండాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా డ్వామా అధికారులు మేట్లను తొలగించి, వారికి అనుకూలమైన వారిని వేసుకుంటున్నారు.

- నిబంధనలకు తిలోదకాలు.. అనుకూలమైన వారి నియామకాలు
- జిల్లాలో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు, 50 మంది మేట్ల తొలగింపు
- స్పీకర్, హోంమంత్రి నియోజకవర్గాల్లో పెరిగిన పెత్తనం
- క్రిమినల్ కేసు పెట్టి 16 ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ వీఆర్పీ తొలగింపు
- తొలగించిన వీఆర్పీల్లో ఆరుగురు పదేళ్లకు పైగా అనుభవం ఉన్నవారే



ఇటీవల మాకవరపాలెంలో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ పేద కూలీలకు 'ఉపాధి' పనులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల నిర్వహణ, కొత్త ప్రభుత్వ పాలనలో మితిమీరిన రాజకీయ జోక్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పన బాగా తగ్గిపోయింది. గత ఏడాది జూన్‌లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే... ఆయా పార్టీల ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఉపాధి హామీ పథకంలో కీలకమైన వీఆర్పీలను (ఫీల్డ్ అసిస్టెంట్లు) పెద్ద ఎత్తున తొలగించేలా చేశారు. క్షేత్రస్థాయిలో కూలీలకు పనులు కల్పించే ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ పార్టీల కార్యకర్తలను నియమించుకున్నారు. కొత్తగా వచ్చిన వారికి ఉపాధి హామీ పథకం అమలుపై అవగాహన లేకపోవడంతోపాటు గ్రామ రాజకీయాలకు ప్రభావితమై ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులకు పనులు కల్పించడానికి వెనుకాడుతున్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల వల్ల ఉపాధి పనులు లేక లబ్ధిదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగింపు

జిల్లాలో హోంమంత్రి వంగలపూడి అనిత ప్రాతినిత్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు, 10 మంది మేట్లను తొలగించారు. ఈ నెలలో ఉపాధి పనులు ప్రారంభమైన మరుక్షణం నుంచి మేట్లను కూడా దఫదఫాలుగా తొలగించేందుకు కూటమి నాయకులు సిద్ధంగా ఉన్నారు. పాయకరావుపేట మండలంలో ఈదటం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా 16 ఏళ్లుగా పనిచేస్తున్న మేకా సోమయ్యపై క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగించారు. అదేవిధంగా ఏడేళ్లుగా పనిచేస్తున్న గోపాలపట్నం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పి.వర్మను, 9 ఏళ్లుగా పనిచేస్తున్న పెదరామభద్రపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలతలను ఇంటికి పంపించారు 16 ఏళ్లుగా శ్రీరాంపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బత్తిన శ్రీనివాస్, 16 ఏళ్లుగా నామవరం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దాసరి సీతారామస్వామిని, 9 ఏళ్లుగా మాసాహెబ్‌పేట ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజులను తొలగించారు.

స్పీకర్ అయ్యన్న ఇలాకాలో..

స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గంలో ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు 30 మందికి పైగా మేట్లను తొలగించారు. పాయకరావుపేట, నర్సీపట్నం కాకుండా మిగతా ప్రాంతాల్లో 10మంది మేట్లకు ఉద్వాసన పలికారు. మరో 50 మంది మేట్లను తొలగించేందుకు సిద్ధపడుతున్నారు. గొలుగొండ మండలంలో పుత్తడిగైరంపేట ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు. మాకవరపాలెం మండలం భీమబోయనపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదిరించడంతో భయపడి రాజీనామా చేశాడు. మాకవరపాలెం మండలంలో మామిడిపాలెం గ్రామంలో అర్హతున్న ఏడుగురు మేట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారు.

క్రిమినల్ కేసులు బనాయించి మరీ తొలగించారు..



నేను ఎటువంటి అవకతవకలకు పాల్పడకపోయినా కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే అన్యాయంగా తొలగించారు. హోంమంత్రి వంగలపూడి అనిత అప్పటి డ్వామా పీడీ సందీప్‌పై ఒత్తిడి తెచ్చి మరీ నాపై వేటు వేశారు. ఆయనతో మాకు ఫోన్ చేయించి రాజీనామా చేయాలని చెప్పించారు. నేను చేయనని చెప్పాను. నాపై క్రిమినల్ కేసులు పెట్టి మరీ తొలగించారు. 16 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. నాతోపాటు నామవరం, శ్రీరాంపురం ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా భయపెట్టి తొలగించారు. మిగతా వారిని మరో నెల రోజుల తరువాత సాగనంపారు. నిజంగా నేను తప్పు చేస్తే.. అదే మస్తరు షీటుపై సంతకాలు చేసే ఎంపీడీఓ, క్వాలిటీ కంట్రోల్ అధికారి, ఏపీఓ, డ్వామా పీడీ, టెక్నికల్ అసిస్టెంట్ అందరూ తప్పు చేసినట్లే. వారిని కూడా తొలగించాలి. ఇదే వృత్తి మీద ఆధారపడి జీవించే మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. జిల్లాలో 50 మందికిపైగా మేట్లను అక్రమంగా తొలగించారు.

– మేకా సోమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఈదటం గ్రామం, పాయకరావుపేట నియోజకవర్గం

గ్రూప్‌లో మెజారిటీ ఉన్నా.. మేట్‌గా రిజిస్టర్ చేయలేదు



మా గ్రూప్‌లో 50 మంది ఉపాధి కూలీలున్నారు. 25 మంది కన్నా ఎక్కువగా కూలీలు మద్దతుంటే మేట్‌గా రిజిస్టర్ చేయాలి. నాకు 30మందికి పైగా కూలీల మద్దతు ఉంది. అయినా మేట్‌గా రిజిస్టర్ చేయలేదు. ఇలా 7 గ్రూపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మేట్లను నియమించారు. అధికారులు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యమిస్తాం.

– అడిగర్ల అప్పలనాయుడు, మామిడపాలెం గ్రామం, మాకవరపాలెం

కూటమి నేతల సిఫార్సులతో అర్హత లేకున్నా కూటమి పార్టీ అనుకూలస్థులను మేట్లుగా ఎంపిక చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో ఉపాధి పనులు ప్రారంభం కావడంతో ప్రతీ గ్రామంలో మేట్లను తొలగించేందుకు కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మేట్లను తొలగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం, అధికారుల తీరుకు నిరసనగా ఇటీవల ఉపాధి కూలీలు నిరసన ప్రదర్శన చేశారు.

ఫార్మాసిటీలో ఇద్దరు కార్మికులకు అస్వస్థత

నిద్ర మాత్రల పౌడర్ ప్యాకింగ్‌లో ఘటన

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని టొరెంటో పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికులు పి.రామకృష్ణ, జె.బసవేశ్వరరావులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలు. పరిశ్రమలో నిద్ర మాత్రల తయారీకి ఉపయోగించే జోల్పిడమ్ పౌడర్‌ను ప్యాకింగ్ చేస్తుండగా, ఆ పౌడర్‌ను పీల్చడంతో స్పృహ తప్పి పడిపోయారు. సమాచారం అందుకున్న యాజమాన్యం ఇరువురిని విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కొలుకుంటున్నారని సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

నేడు రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



సాధన చేస్తున్న క్రీడాకారులు

ఎంవీపీకాలనీ (విశాఖ): విశాఖ వేదికగా రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టును సోమవారం ఎంపిక చేస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర కబడ్డీ సంఘం సెలక్షన్ కమిటీని నియమించిందని ఓ ప్రకటనలో వెల్లడించారు. కమిటీ సభ్యులుగా కబడ్డీ నేషనల్ మెడలిస్ట్ ప్రసాదరెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ పద్మరాజు, వైవీ శ్రీనివాస్ ఉన్నారు. ప్రస్తుతం 19 మంది క్రీడాకారులకు నగరంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 12 మందిని కమిటీ తుది జట్టుకు ఎంపిక చేస్తుంది. ఈ జట్టు కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- 27న జరిగే ఎన్నికలకు సిబ్బంది నియామకం
- 18న తొలి విడత శిక్షణ తరగతులు
- 25 వేల బ్యాలెట్ పత్రాల తయారీ

మహారాణిపేట(విశాఖ): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సారథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ ఏర్పాట్లు చేస్తున్నారు. పది మంది అభ్యర్థులు తుది ఎన్నికల బరిలో నిలిచారు. అభ్యర్థుల పేరుతో తెలుగులో బ్యాలెట్ పత్రం రూపొందించి, ప్రింటింగ్ కోసం కర్నూలు ప్రభుత్వ ముద్రణాలయానికి పంపారు.

అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం

అభ్యర్థులు నామినేషన్‌లో పేర్కొన్న మేరకు తొలి అక్షరం ఆధారంగా తెలుగు అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం నమూనాను తయారు చేశారు. తుది జాబితా మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి అదనంగా మరో పది శాతం కలిపి సుమారు 25 వేల బ్యాలెట్ పత్రాలను ముద్రిస్తున్నారు. ఇవి ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖ చేరుకునే అవకాశం ఉంది. ఎన్నికల తేదీకి రెండు రోజులు ముందు వాటిని బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

18 నుంచి తొలి విడత శిక్షణ

ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 18 నుంచి సిబ్బందికి, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. రెండో విడత శిక్షణ 24న ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరపనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో)తోపాటు ముగ్గురు సిబ్బంది అవసరం. మొత్తం 492 మంది సిబ్బంది తోపాటు అదనంగా మరో పది శాతం మందిని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు.

తల్లి చెంతన పూరీ జగన్నాథ్



తల్లి సత్యవతితో పూరీ జగన్నాథ్, ఉమాశంకర్ గణేష్, సాయిరామ్ శంకర్, ఇతర కుటుంబ సభ్యులు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోదరుడు, ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తల్లి సత్యవతి అలియాస్ అమ్మాజీ వద్దకు వచ్చారు. ఇటీవల ప్రమాదానికి గురికావడంతో ఆమె చేతికి ఆపరేషన్ జరిగింది. విషయం తెలియడంతో సోదరుడు, సినీ హీరో సాయిరామ్ శంకర్‌తో కలిసి పూరీ జగన్నాథ్ తల్లిని చూసేందుకు ఆదివారం గణేష్ ఇంటికి చేరుకున్నారు. తల్లిని అక్కున చేర్చుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం తర్వాత కుమారుడిని చూసిన తల్లి అమ్మాజీ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. సోదరులు గణేష్, సాయిరామ్, మరదళ్లు, పిల్లలు, తల్లితో జగన్నాథ్ సరదాగా గడిపారు. పూరీ రాకతో గణేష్ ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. పూరీ జగన్నాథ్ అభిమానులు, బంధువులు ఆయనను కలిసేందుకు తరలివెళ్లారు.

స్టీల్‌ప్లాంట్ జేఎన్ అవార్డుల ప్రదానం వాయిదా?

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఫిబ్రవరి 18న ఇచ్చే జవహర్‌లాల్ నెహ్రూ(జేఎన్) అవార్డుల ప్రదానం వాయిదా పడినట్టు తెలుస్తోంది. స్టీల్‌ప్లాంట్ కోసం అంకితభావంతో కృషి చేసే అధికారులు, కార్మికులకు ఏటా ఫిబ్రవరి 18న ఉక్కు అవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులిస్తారు. ఆ రోజు ఉద్యోగుల కుటుంబీకులు, ఉన్నతాధికారుల సమక్షంలో సీఎండీ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం ఆనవాయితీ.

ఉక్కు అధికారులు, కార్మికులకు చెందిన గత మూడేళ్ల వార్షిక ప్రావీణ్యత రేటింగ్(ఏసీఆర్), అటెండెన్స్ తదితర ప్రమాణాలను బట్టి ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు. 2023–24కు చెందిన అధికారుల ఏసీఆర్ సిద్ధం కాకపోవడమే జాప్యానికి కారణమని తెలుస్తోంది

నేటి నుంచి యూసీసీ కప్

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ కప్ క్రికెట్ టోర్నీ సోమవారం రైల్వే స్టేడియంలో ప్రారంభం కానుంది. 12 జట్లు నాలుగు గ్రూప్‌లుగా తలపడుతుండగా.. గాజువాక గ్రీన్స్, ఈకోర్నా జట్ల మధ్య ప్రారంభం జరగనుంది. లీగ్ మ్యాచ్‌లు జింక్ గ్రౌండ్‌లో, నాకవుట్ మ్యాచ్‌లు రైల్వే స్టేడియంలో జరగనున్నాయి. చారిటీ కోసం నిర్వహిస్తున్న ఈ టోర్నీకి సంబంధించి ఆదివారం జట్ల టీషర్ట్‌లను విడుదల చేశారు.

బెంజ్ లారీ ఢీకొని బతుకు ఛిద్రం 8లో

నలభై ఏళ్ల తరువాత మళ్లీ కలిశారు... 8లో

క్లుప్తంగా

జనారణ్యంలోకి జింక


ఎండాడ అపార్ట్‌మెంట్‌లో జింక


కాలికి గాయం కావడంతో పడిపోయిన జింక

కొమ్మాది: ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు ఆహార కొరత.. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఇటీవల బోరవానిపాలెం, ఎండాడ ప్రాంతాలకు వచ్చిన రెండు జింకలు మృతి చెందగా, 10 రోజుల కిందట ఎండాడలో కుక్కల దాడిలో మరో జింక మృతి చెందింది. ఆదివారం ఓ జింక ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి వచ్చేసింది. కదల్లేని స్థితిలో ఉన్న జింకను స్థానికులు ప్రథమ చికిత్స అందించి.. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు అక్కడికి చేరుకుని.. వైద్య చికిత్స నిమిత్తం జింకను కంబాల కొండకు తరలించారు. కాగా.. కంబాల కొండలో సరైన రక్షణ లేకపోవడం వల్ల జింకలు ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయి. జింకలు వరసగా మరణిస్తున్నప్పటికీ అటవీ శాఖ, జూ సిబ్బంది పట్టించుకోవడం లేదని జంతుప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు రెండు శఠగోపాల బహూకరణ


శఠగోపాలను అందజేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ గ్లోబల్ చైర్మన్ మధుపండితదాస

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ సుమారు రూ.10 లక్షలు విలువ చేసే రెండు బంగారు శఠగోపాలు(వెండిపై బంగారు పూత) బహూకరించింది. గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత మధుపండిత దాస సింహగిరికి వచ్చి శఠగోపాలను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు అందజేశారు. సంస్థ సభ్యులతో కలిసి స్వామి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం తరపున అధికారులు మధుపండిత దాసకు, ఆయనతో వచ్చిన సంస్థ సభ్యులకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

'ప్రభుత్వ భూములను పరిరక్షించండి'

మధురవాడ: విశాఖ రూరల్ మండల పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఉపయోగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ అభియోగాలపై 7గురు అధికారులకు జేసీ నోటీసులిచ్చి, ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు చెప్పారు.

క్యాన్సర్‌ను జయిద్దాం


శారీ వాక్‌లో సినీనటి గౌతమి, మేయర్ హరివెంకట కుమారి తదితరులు



ర్యాంప్ వాక్ చేస్తున్న యువతులు


పింక్ శారీ వాక్‌లో భాగంగా జుంబా డ్యాన్స్ చేస్తున్న మహిళలు



శారీ వాక్‌లో ఉత్సాహంగా మహిళలు


వాక్ చేస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్ : క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి...ఆరోగ్యంగా జీవించండి అంటూ సినీనటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమల్ల నగరవాసుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆదివారం బీచ్‌రోడ్డులో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ సంయుక్తంగా నిర్వహించిన పింక్ సఖి శారీ వాక్‌లో ఆమె ప్రసంగించారు. క్యాన్సర్ వస్తే జీవితం అక్కడితో ఆగిపోతుందనే అపోహ నుంచి ముందుగా బయటపడాలన్నారు. సరైన చికిత్స తీసుకుంటే ఎంతకాలమైనా జీవించవచ్చు అనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా తానేనని పేర్కొన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడం ఎంత అవసరమో గుర్తించాలని ప్రజలకు సూచించారు. మీపై ఒక కుటుంబం ఆధారపడి ఉందనే విషయం మరువకూడదన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి మహిళలకు ఉందన్నారు. క్యాన్సర్ ఎటువైపునుంచైనా, ఎవరికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ లక్షణాలను తెలుసుకోవడం, సరైన చికిత్స తీసుకోవడం, నిండైన జీవితాన్ని అనుభవించడం ఎంతో అవసరమన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ ప్రతి ఏడాది వేలాది మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. మహిళలు అధికంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా విశాఖ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రాథమిక దశల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స అందించడం, ప్రాణాలను రక్షించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ జి.అనంత రామ్ మాట్లాడుతూ మరింత విస్తృత అవగాహన ప్రజల్లో కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. తాము చేపడుతున్న ప్రతీ కార్యక్రమానికి సంపూర్ణ సహాయం అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పీసీవోడీపై వైజాగ్ వలంటీర్స్‌తో కలిసి అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమానికి ముందుగా యాంకర్, సినీనటి శిల్పా చక్రవర్తి వ్యాఖ్యానంతో సాగిన జుంబా డాన్స్, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో మహిళలు, యువత, చిన్నారులు పింక్ సఖి శారీ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాలలో రాణిస్తున్న మహిళలు, క్యాన్సర్‌ను జయించిన వారిని వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి అనంతరామ్, డైరెక్టర్ ప్రాజెక్ట్ (ఆర్‌ఎంటి) గుర్మీత్ కోహ్లి, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎం.డి డాక్టర్ జి.సాంబశివరావు, గురుద్వార సాథ్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్ ఆనంద్,ఏజీ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎస్.ఎస్ రాజు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్, అభిజ్ఞ, హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఆదిత్య, మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు వి.మురళీకృష్ణ, రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో నేవీ ఉద్యోగికి బంగారు పతకం


జాతీయ అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అప్పనదొరకు పౌర సన్మానం చేస్తున్న గ్రామస్తులు

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం రైవాడ పంచాయితీ శివారు శంభువానిపాలేనికి చెందిన నేవీ ఉద్యోగి ఉగ్గిన అప్పన్నదొర జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. సామాన్య గిరిజన కుటుంబానికి చెందిన అప్పన్నదొర రాజస్థాన్‌లో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో 45 సంవత్సరాల విభాగంలో 4''400 రిలే పరుగు పందెంలో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే 4''100 రిలే పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలను సాధించారు. లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలను సాధించారు.

అప్పన్న దొరకు ఘనంగా పౌర సన్మానం

క్రీడా పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో తమ గ్రామానికి గుర్తింపు తెచ్చిన అప్పన్నదొరను శంభువానిపాలెం గ్రామస్తులు ఆదివారం పౌర సన్మానం చేశారు. అభినందనలతో ముంచెత్తారు. అప్పన్నదొర క్రీడా స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలంటూ పౌర సన్మానంలో పాల్గొన్న పంచాయతీ పెద్దలు చల్లా నాయుడు, చల్లా నానాజీ, ఉగ్గిన దేముళ్లు స్థానిక యువతకు సూచించారు.

40 ఏళ్ల తరువాత మళ్లీ కలిశారు..


కుటుంబాలతో కలిసి ఆత్మీయ సమావేశమైన ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు

అనకాపల్లి : ఏరా మిత్రమా... ఏమి చేస్తున్నావు.. బాగున్నావా.. పిల్లలు ఎలా ఉన్నారు... అంటూ ఏఎంఎఎల్ కళాశాల 1981–84 డిగ్రీ పూర్వ విద్యార్థులు ఒకరి నొకరు పలకరించుకున్నారు. 40 ఏళ్ల క్రితం కళాశాలలలో నాటి తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సమేతంగా స్థానిక రింగ్‌రోడ్డు సన్ క్యాస్ట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సమావేశమయ్యారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వపు డిగ్రీ విద్యార్థులంతా తిరిగి ఒక్కచోట కలుసుకోవడంతో ఆనందం వెల్లివిరిసింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి అధ్యాపకులను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సమేతంగా వివిధ రకాలైన ఆటలపోటీల్లో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో సరిసా శ్రీనివాసరావు, కొట్టారు రంగబాబు, వేగి వెంకటరావు, కాళ్లకూరి శ్రీనివాస్, విల్లూరి రెడ్డమ్మ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి


భూసరి రాజబాబు(ఫైల్)

మహారాణిపేట: హత్య కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న భూసరి రాజబాబు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. గతేడాది నవంబర్‌లో ఏజెన్సీలోని కొయ్యూరు మండలం, బకులూరు సమీపంలో జరిగిన హత్య కేసులో రాజబాబు రెండో నిందితుడిగా ఉన్నారు. రిమాండ్ ఖైదీగా విశాఖ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని ఆరోగ్యం విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. రాజబాబు మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి, మృతదేహాన్ని జైలు అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ తెలిపారు.

విశాఖలో ఐపీఎల్ పండగ

- మార్చి 24, 30న రెండు టీ–20 మ్యాచ్‌లు
- ఊపందుకున్న స్టేడియం ఆధునికీకరణ పనులు

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్ మ్యాచ్‌లకు విశాఖలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం మరోసారి వేదిక కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి హోమ్ పిచ్‌గా వైఎస్సార్ స్టేడియాన్ని ఎంచుకోవడంతో ఆధునికీకరణ పనులు వేగవంతమయ్యాయి. మొత్తంగా స్టేడియం ఎలివేషన్ మారిపోనుండగా, కార్పొరేట్ బాక్సులు, ఆటగాళ్ల గ్రీన్ రూంల్లోనూ ఆధునిక వసతుల కల్పన చకచకా సాగిపోతోంది. స్టేడియంలోని స్టాండ్స్‌లో కుర్చీలను కూడా ఏసీఏ మారుస్తోంది. దీంతో వైఎస్సార్ స్టేడియం సరికొత్త రూపుతో ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో హోమ్ పిచ్‌గా విశాఖ స్టేడియాన్ని ఎంచుకుందని, ఈ సీజన్‌లోనూ రెండు మ్యాచ్‌లకు వేదిక కానుందన్నారు.

మార్చి 24న డీసీతో ఎల్‌ఎస్‌జీ ఢీ

ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారం మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తలపడనుంది. రాత్రి ఏడున్నర గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. మార్చి 30న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవుతుంది. హైదరాబాద్ జట్టు తరఫున స్థానిక ఆటగాడు నితీష్‌కుమార్ బరిలోకి దిగనుండడం విశేషం.

లారీ ఢీకొని బతుకు ఛిద్రం

- రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి
- మరో యువకుడికి తీవ్ర గాయాలు


ఎన్టీఆర్ ఆస్పత్రి పోస్టుమార్టం రూమ్ వద్ద విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు


బైక్‌ను ఢీ కొట్టిన లారీ


ఉమ్మలాడ జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన గుణ తేజశ్వంత్


గాయపడిన యర్రంశెట్టి హర్షవర్ధన్


గుణ తేజశ్వంత్(ఫైల్)

అనకాపల్లి : చేతికి అందివస్తాడనుకున్న కుమారుడు గుణ తేజశ్వంత్(17) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యులు భోరున విలపించారు. పట్టణంలో వేల్పులవీధికి చెందిన గుణ తేజశ్వంత్(17), విజయరామరాజుపేటకు చెందిన యర్రంశెట్టి హర్షవర్ధన్‌లు పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గుణ తేజశ్వంత్ శనివారం యలమంచిలి మండలం పద్మనాభపేట గ్రామంలో ఓ శుభకార్యానికి తన తల్లి యశోదతో కలిసి వెళ్లారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకుని వారి ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం కోసం జాతీయ రహదారి ఉమ్మలాడ జంక్షన్ వద్ద హోటల్‌కు వెళ్లి బిరియాని తీసుకుని వస్తామని చెప్పి స్నేహితులైన విజయరామరాజుపేటకు చెందిన హర్షవర్ధన్, ధనుష్‌లతో కలిసి రెండు ద్విచక్రవాహనాలపై హోటల్‌కు వెళ్లారు. హర్షవర్ధన్ బైక్‌పై గుణ తేజశ్వంత్, హర్షవర్ధన్‌లు బయలు దేరారు. మరో బైక్‌పై ధనుష్ వెళ్లిపోయాడు. ముగ్గురూ ఉమ్మలాడ జంక్షన్ వద్ద హోటల్‌లో భోజనం చేసి, తల్లికి భోజనం పట్టుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. జంక్షన్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న సమయంలో యలమంచిలి నుంచి విశాఖ వెళుతున్న బెంజ్ లారీ గుణ తేజశ్వంత్, హర్షవర్ధన్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తేజశ్వంత్ అక్కడిక్కడే మృతిచెందగా, హర్షవర్ధన్ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, క్షతగాత్రుడు హర్షవర్ధన్‌కు ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడు తల్లి యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్‌ఐ డి.శేఖరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


రాజేశ్వరి

యలమంచిలి రూరల్ : పట్టణంలోని శేషుకొండ కాలనీకి చెందిన రంగాల లోవరాజు కుమార్తె రాజేశ్వరి(18) అదృశ్యమైనట్టు తండ్రి లోవరాజు ఆదివారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృత్తి రీత్యా గీత కార్మికుడైన లోవరాజు ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో కల్లు అమ్ముకునేందుకు వెళ్లాడు. అర్ధగంట తర్వాత ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె కనిపించలేదు. తర్వాత ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె. సావిత్రి విలేకరులకు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం వరకు చదివిన రాజేశ్వరి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటోంది.

రేపు 'వ్యవసాయ రంగం–పెను సవాళ్లు' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు

అనకాపల్లి : స్థానిక సీపీఐ శత వార్షికోత్సవాలు స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ మాజీ శాసన సభ్యుడు స్వర్గీయ కోడుగంటి గోవిందరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 18న ఉదయం 10 గంటలకు వై.విజయకుమార్ హాల్లో 'వ్యవసాయ రంగం– పెను సవాళ్లు' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజాన దొరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి విచ్చేయుచున్నట్టు చెప్పారు.

హరేకృష్ణ వైకుంఠంలో ఆధ్యాత్మిక శోభ


రాధాకృష్ణులకు అభిషేకం

తగరపువలస : గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీ రాధాకృష్ణుల విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల సమక్షంలో వివిధ రకాల పండ్లను రాధాకృష్ణుల విగ్రహాలపై ఉంచి ఫలాధివాసం, పట్టు వస్త్రాలతో వస్త్రాధివాసం నిర్వహించారు. అనంతరం రకరకాల పుష్పాలను, హారాలను ఉంచి సయ్యానాధివాసం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రాణప్రతిష్ఠ, ఆరాధన గురించి పద్మ శ్రీ అవార్డు గ్రహీత మధు పండితదాస వివరించారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, ఇస్కాన్ బెంగళూర్ వైస్ ప్రెసిడెంట్ వాసుదేవ కేశవ ప్రభు, ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ చంద్రోదయ మందిరం ఉపాధ్యక్షుడు యధిష్టిర కృష్ణదాస, అహ్మదాబాద్ హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు జగన్ మోహన కృష్ణదాస, విజయవాడ అధ్యక్షుడు వంశీధర దాస, విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తదితరులు ప్రవచించారు.

కోడిపందేలాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు

చీడికాడ : మండలంలోని చుక్కపల్లిలో అభయాంజనేయస్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన కోడి పందేలపై దాడి జరిపి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.సతీష్ తెలిపారు.ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో దాడి చేసామని, రెండు పందెం కోళ్లను, వెయ్యి రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు

చోడవరం : గంజాయి రవాణా చేస్తూ ఇద్దరు యువకులు చోడవరం పోలీసులకు పట్టుబడ్డారు. చోడవరం మండలం గౌరీపట్నం జంక్షన్ వద్ద బీఎన్‌రోడ్డులో చోడవరం ఏఎస్‌ఐ పి. కేశవరావు, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటారు సైకిల్‌పై ఒడిస్సా నుంచి కరీంనగర్ జిల్లాకు బ్యాగ్‌లో గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద 4 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను, మోటారు సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేల బావిలో పడి రైతు మృతి

నర్సీపట్నం : ప్రమాదవశాత్తూ నేల బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన నర్సీపట్నం మండలం, బంగారయ్యపేటలో జరిగింది. ఎస్‌ఐ రాజారావు అందిన వివరాలిలా ఉన్నాయి. సిహెచ్.అప్పలనాయుడు (50) గ్రామ శివారులోని నేల బావి దగ్గర మోటార్ పంపుతో పొలానికి నీళ్లు పెడుతుండగా ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయాడు. మృతుడు భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం



దాతకు సత్యవతికి బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పార్వతీపురం మన్యం జిల్లా, బలిజిపేట మండలం, అరసాడ గ్రామానికి చెందిన కళ్యంపూడి సత్యవతి రూ.2 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ ఏఈవో వి.రాంబాబు, సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ ఇచ్చారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

20న మరిడిమాంబ జాతర



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల: పట్టణంలో విజయరామరాజుపేట మరిడిమాంబ జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 20న జరగనున్న అమ్మవారి మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి ఆహ్వానించారు. జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్, నాయకులు, విజయరామరాజు పేట గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్య భగవాన్‌కు ప్రత్యేక పూజలు



సూర్యనారాయణస్వామి

అనకాపల్లి: పట్టణ, మండలంలో సూర్యనారాయణస్వామి దేవాలయాల్లో స్వామివారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ స్వామివారి దేవాలయంలో ప్రధాన అర్చకులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణస్వామి ఆలయ కమిటీ ప్రతినిధి మారిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీపై కేసు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళ్తున్న బండరాళ్ల లారీపై జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం అధిక లోడుతో బండరాళ్లతో వెళ్తున్న లారీని పట్టుకొని రూ.74 వేల మేర జరిమానా విధించనట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ఇట్స్ కాంప్లికెటెడ్	:రాజా
ఆరెంజ్	:సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1.2 షోలు)
కెప్టెన్ అమెరికాతెలుగు వెర్షన్	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
సూర్య కృష్ణన్	:వెంకటేశ్వర(ఉదయం)
తల	వెంకటేశ్వర (మ్యాట్నీ, 1.2 షోలు)
లైలా	:శ్రీసత్య
బ్రహ్మానందం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 212 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరు సంప్రదించవచ్చు.

అన్నార్తుల ఆకలి తీరుస్తూ...

అన్నం పరబ్రహ్మ స్వరూపం.. ఆ విలువ తెలియక వృథా చేస్తున్న వారు ఎందరో ఉండగా, ఒకపూట భోజనానికి వేదనకు గురయ్యే వారెంతో మంది ఉన్నారు. ఇలాంటి అన్నార్తుల ఆకలి తీరుస్తోంది కశింకోట సత్యసాయి సేవా కేంద్రం. 18 ఏళ్లుగా సేవా స్ఫూర్తితో నిత్యాన్నదానం చేస్తూ నిరాధారులకు భరోసా కల్పిస్తోంది.



మధ్యాహ్న భోజనం చేస్తున్న నిరాధారులు

- కశింకోటలో 18 ఏళ్లుగా నిత్యాన్నదానం
- ఇళ్లకు వెళ్లి ఆకలి తీరుస్తున్న సేవకులు
- దాతలు, భక్తుల విరాళాలతో సేవా కార్యక్రమం
- ఆదర్శంగా సత్యసాయి సేవా కేంద్రం



ఆకు కూరలు సిద్ధం చేస్తున్న మహిళలు

కశింకోట: పైసా ఆశించకుండా అన్నార్తుల ఆకలి తీర్చడం కంటే మానవ సేవ ఇంకేముంటోంది. కశింకోటలోని సత్యసాయి సేవా కేంద్రం నారాయణ సేవ(నిత్యాన్నదానం) అందిస్తూ నిరాధారులను ఆదరిస్తోంది. స్థానిక సాయి భజన మండలి, దాతల సహకారంతో 18 ఏళ్లుగా నిరాటంకంగా ఈ కార్యక్రమం సాగుతోంది. కరోనా సమయంలోనూ ఆకలితో ఉన్న వారి కడుపు నింపి భరోసా కల్పించింది.

కశింకోటలోని కస్పావీధి ప్రాంతంలో సాయి భజన మండలి సభ్యులు నగర సంకీర్తన, సాయి నామస్మరణతో భజనలు నిర్వహిస్తూ ఉండేవారు. సత్యసాయి బాబా అందించిన అనేక సేవా కార్యక్రమాలను వీక్షించిన భజన మండలి సభ్యులు వాటిని స్ఫూర్తిగా తీసుకొని క్షుద్బాధతో సతమతమయ్యే నిరాధారులను ఆదుకోవాలని సంకల్పించి నారాయణసేవ (నిత్యాన్నదానం) కార్యక్రమాన్ని 18 ఏళ్ల క్రితం తొలిసారిగా కస్పావీధి రామాలయంలో ప్రారంభించారు. ఇక్కడకు వృద్ధులు, నిరాధారణకు గురైన వారు, దివ్యాంగులు, కుటుంబం గడవడం కష్టం అయిన వారు తదితరులు వచ్చి ఆకలి తీర్చుకుంటున్నారు. మొదట 25 మందితో మొదలైన కార్యక్రమంలో ఇప్పుడు 150 మంది వరకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

4 ఏళ్లుగా సొంత భవనంలో..

నాలుగేళ్ల క్రితం వచ్చిన కరోనా మహమ్మారి వరకు 14 ఏళ్ల పాటు కస్పావీధి రామాలయం వద్ద సామాజిక భవనంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. తర్వాత పాలూరి గుప్తా కోమటి వీధిలో సేవా భావంతో పది సెంట్ల స్థలాన్ని ఉచితంగా సమకూర్చారు. దానిలోని నాలుగు సెంట్ల భూమిలో సత్యసాయి సేవా కేంద్రాన్ని నాలుగేళ్ల క్రితం భజన మండలి సభ్యులు, దాతలు సమకూర్చిన విరాళాలతో దాదాపు రూ.70 లక్షలు వెచ్చించి రెండు అంతస్తుల్లో భవనాన్ని అందంగా నిర్మించారు. దిగువ అంతస్తులో నిత్యాన్నదానానికి, పై అంతస్తులో సత్య సాయిబాబాకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి కేటాయించారు. నిత్యాన్నదానానికి వంట షెడ్డు, వెనుక గోశాల షెడ్డు నిర్మించారు. అప్పటి నుంచి అదే భవనంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది.



కోమటి వీధిలో నారాయణసేవ నిర్వహిస్తున్న సత్యసాయి సేవా కేంద్రం

కరోనా కష్టకాలంలోనూ ఆగని సేవా కార్యక్రమం

కరోనా సమయం నుంచి ఇళ్లకు భోజన ప్యాకెట్లను అందివ్వడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఎక్కువ మందికి నేరుగా భోజనం ప్యాకెట్లు తయారు చేసి సరఫరా చేస్తున్నారు. సాధారణ రోజుల్లో అన్నం, పప్పు ఆకుకూర, రసం, మజ్జిగ అందిస్తున్నారు. కొందరు పెళ్లి రోజులు, జన్మదినోత్సవాలు, సంవత్సరీకాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో తమ పేరిట అన్నదానం చేయించుకుంటారు. ఇందుకు నామమాత్రంగా రోజుకి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు విరాళాలు అందిస్తారు. అటువంటి రోజుల్లో మిఠాయి, పులిహోర తదితర పదార్థాలను అదనంగా అందిస్తారు.



అన్నం ప్యాకెట్ల తయారీ

అన్నదానం వినూత్నం

సత్యసాయి సేవా కేంద్రంలో అన్నదానం వినూత్నంగా జరుగుతోంది. ఇక్కడ కేంద్రంలో వచ్చిన వారికి భోజనాలు అందిస్తారు. అనారోగ్యం, వృద్ధాప్యం, ఇతర కారణాల వల్ల రాలేని వారి ఇళ్లకు ముగ్గురు సాయిబాబా సేవకులు నిత్యం వెళ్లి మరీ మధ్యాహ్నంతోపాటు రాత్రికి సరిపడా భోజనం, కూరల ప్యాకెట్లు అందిస్తున్నారు. సుమారు 30 మంది కుటుంబ నారాయణ సేవ పేరిట ఆహార ప్యాకెట్లు తయారు చేసి సిద్ధం చేస్తారు. వాటిని సత్యసాయిబాబా సేవకులు ఆయా ఇళ్లకు వెళ్లి అందిస్తారు. దాత ద్వారపురెడ్డి పరమేశ్వరరావు సమకూర్చిన క్యారియర్లలో ఆహార పదార్థాలు పెట్టి ఇస్తుంటారు. ఇక్కడకు రాలేని రెండు కుటుంబాలకు నెలకు అవసరమైన సరుకుల కిట్లను అందిస్తున్నారు. ఇలా సేవా తత్పరతతో పని చేస్తున్న సత్యసాయి సేవా సంస్థ, సత్యసాయి భజన మండలి ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పవచ్చు.



సత్యసాయి



ప్యాకెట్లలో అన్నం నింపుతున్న సత్యసాయి సేవకులు

'అమృత కలశం' పేరిట బియ్యం సేకరణ..

'అమృత కలశం' పేరిట ఆసక్తి ఉన్న దాతలకు 20 ఇళ్లకు కలశాలు ఇచ్చారు. వాటిలో ఆధ్యాత్మిక భావనతో ఒక నియమంగా రోజుకి రెండు పూటలా ఇళ్లలో వంట వండే ముందు వినియోగించే బియ్యంలో చెరో పిడికెడు వేస్తే నెలకు ఎంత మేరకు పోగవుతాయో వాటిని అన్నదానానికి అందిస్తారు. కొందరు బియ్యం, నగదు రూపంలో సమకూరుస్తారు. సత్యసాయి భజన మండలి భక్తులు, నిర్వాహకులు విరాళాలు సమకూర్చి నారాయణ సేవ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఆదరాభిమానాలు చూరగొంటున్నారు. గోశాలను నిర్వహిస్తూ దాతల సహకారంతో అందించిన ఆవు, పెయ్యలను పెంచి పాలను అన్నదానంలో పెరుగు, మజ్జిగగా వినియోగిస్తున్నారు.



బైక్‌పై ఇళ్లకు వెళ్లి భోజనం ప్యాకెట్ల అందజేత

ఆకలి బాధ తీరుస్తోంది



నిత్యాన్నదానం ద్వారా మాలాంటి పేద కుటుంబాల వారిని ఎంతగానో ఆదుకుంటోంది. ఆకలి బాధ తీరుస్తోంది. కూలీ పని చేసుకునే శక్తి లేదు. ఈ కార్యక్రమంలో పదేళ్లకుపైగా భోజనం చేస్తున్నాను.

–తీడ సన్యాసమ్మ, గాడి వీధి, కశింకోట.

రుచికరంగా భోజనం



15 ఏళ్లగా నారాయణసేవలో నిత్యం భోజనం చేస్తున్నాను. భోజనం రుచికరంగా ఉంటోంది. మాలాంటి ఆదాయం లేని కుటుంబాన్ని ఆదుకుంటోంది. కరోనా సమయంలోను ఆగకుండా కార్యక్రమాన్ని కొనసాగించారు. సత్యసాయి సేవా కేంద్రానికి కృతజ్ఞతలు.

– దేవర సింహాచలం, దేవర వీధి, కశింకోట

నాకు క్యారియర్‌లో భోజనం



నేను ఇంటికి క్యారియర్‌లో భోజనం తీసుకు వెళతాను. అక్కడ నిదానంగా మధ్యాహ్నం, రాత్రి తింటాను. నిరాదరణకు గురైన మాలాంటి వారికి నారాయణసేవ ద్వారా పట్టెడు అన్నం అందిస్తున్నారు. ఇది మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– సకల శ్రీరాములు, కోటదిబ్బ, కశింకోట

సత్యసాయిబాబాపై భక్తిభావం



పెంచుకొని సత్యసాయి భజన మండలి నెలకొల్పి ఆధ్యాత్మికతో కొనసాగుతున్నాం. సత్యసాయిబాబా చేపట్టిన అనేక సేవా కార్యక్రమాల స్ఫూర్తిగా తీసుకొని నారాయణసేవ కార్యక్రమాన్ని 18 ఏళ్ల క్రితం సంకల్పించాం. అప్పటి నుంచి నిరాటంకంగా కొనసాగిస్తున్నాం. భజన మండలి సభ్యులు, దాతల సహకారంతో కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నాం. అంతా సత్యసాయిబాబా ఆశీస్సులే.

–ముక్కా చిన్నతల్లి, సత్యసాయి భజన మండలి ప్రతినిధి, కశింకోట

కనీస వేతనాలు అందించాలి

– సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్

కశింకోట: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కశింకోటలో నిర్వహించిన స్కూలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల సకాలంలో వేతనాలు అందడం లేదని, ఇది శోచనీయమన్నారు. స్కూళ్లలో పని భారం పెరిగిందని, దీనిదృష్ట్యా 50 మంది విద్యార్థులకు ఒకరు వంతున పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. అనారోగ్య సమయంలో సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, మండల యూనియన్ అధ్యక్షురాలు జి. వరలక్ష్మి, ప్రతినిధులు సునీత, సింహాచలం, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు అరుణ



ఆపరేషన్లకు కంటి రోగుల తరలింపు

కశింకోట: విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాళ్లపాలెంలోని రామాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 72 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు అరుణ రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కంటి నరాలు, కంటిపై పొర చికిత్సల కోసం చెరో ఇద్దరు, కంటి నీటి కాసులు, కంటి రెప్పలు, చిన్న పిల్లల కంటి చికిత్సల కోసం ఒక్కొక్కరు వంతున ఎంపిక చేసి వారికి ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఆస్పత్రిలో చికిత్స నిర్వహించడానికి సిఫార్సు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం. అరుణకుమార్, ఆప్తాలమిక్ లావణ్య, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు

పీక్కు తింటున్న కుక్కలు.. పట్టించుకోని అధికారులు



ముత్యాలమ్మపాలెం తీరంలో ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరాన్ని తింటున్న కుక్కలు



తీరంలో పడివున్న తాబేలు కళేబరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో ఈ మధ్య కాలంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అవి ఒడ్డుకు కొట్టుకురావడంతో, వీధి కుక్కలు పీక్కుతింటున్న దృశ్యాలు ఆదివారం దర్శనమిచ్చాయి. ఇటీవల మత్స్యకారుల వలలకు పదుల సంఖ్యలో తాబేళ్లు చిక్కాయని వాటిని మళ్లీ సముద్రంలో విడిచిపెట్టినట్లు గంగపుత్రులు చెప్పారు. ఫార్మాసిటీ పరిశ్రమల ద్వారా విడుదలైన వ్యర్థ రసాయనాలు సముద్ర జలాల్లో కలవడం వల్లే తాబేళ్లు మృతి చెంది ఉండవచ్చని మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సముద్ర జలాల్లో మృతి చెంది తీరానికి చేరిన కళేబరాలతో ఆ ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని సందర్శకులు వాపోతున్నారు. కనీసం తీరానికి కొట్టుకు వచ్చిన తాబేళ్ల కళేబరాలను పూడ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలు, బాలికల రక్షణ కోసం చట్టాలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

కశింకోట: మహిళలు, బాలికల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక సమగ్ర బాలికల వసతి గృహంలో బాలికలతో మహిళల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో పోలీసుల సహాయాన్ని, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ఏ రంగంలోను బాలికలు బాలురకు ఎక్కడా తీసిపోరన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని తమ కెరీర్ కోసం ముందుకు సాగాలన్నారు.

దారికాచి.. దోపిడీ

పెందుర్తి: ఇద్దరు వ్యక్తులు దారికాచి తమతో గొడవ పడి నగదును తస్కరించారని ఓ వ్యక్తి పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లపూడి ప్రాంతానికి చెందిన సాయికిరణ్‌కు నాయుడుతోట సాయిదుర్గానగర్‌లో ఇల్లు ఉంది. ఆదివారం సాయంత్రం ఇంటిని చూద్దామని వచ్చి, స్నేహితులతో కలిసి సమీపంలోని బార్‌కు వెళ్లాడు. తిరిగి సాయిదుర్గానగర్‌లోని ఇంటికి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని, కిరణ్‌తో పాటు అతని స్నేహితుడిని కొట్టి కిరణ్ జేబులో ఉన్న రూ.5 వేలు లాక్కున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నల్లమారమ్మతల్లి జాతర గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించే సమయంలో ఆయా ప్రాంతాల కమిటీ సభ్యులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో బీఆర్టీ కాలనీలో ఈ నెల 18న జరిగే నల్లమారమ్మతల్లి జాతర గోడపత్రికలను ఆదివారం ఆయన స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నల్లమారమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై చర్యలేవి?




రేబాక అండర్ బ్రిడ్జి వద్ద టిప్పర్ ఇరుక్కుపోవడంతో గంట పాటు నిలిచిపోయిన వాహనాలు

తుమ్మపాల: ఆహ్లాదకరమైన వాతావరణంతో కాలుష్య రహితంగా ఉండే పల్లెలు కూటమి ప్రభుత్వంలో కలుషితంగా మారిపోతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు బండరాళ్లతో గ్రామాల మీదుగా రాకపోకలు చేయడంతో మండలంలో రోడ్లన్నీ రద్దీగా మారాయి. మండలంలో మైనింగ్ కొండల నుంచి బండరాళ్లను రాంబిల్లికి తరలించడమే పనిగా రాత్రింబవళ్లు టిప్పర్లు తిరుగుతున్నాయి. ఒకప్పుడు మైనింగ్ కొండలు ఉన్న గ్రామాలకే పరిమితమైన కలుషితం ఇప్పుడు అన్ని గ్రామాలకు పాకింది. గ్రామాల్లో వెదజల్లుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు దగ్గు, శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. రోడ్లపై వందల సంఖ్యలో టిప్పర్లు రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ఎక్కడికక్కడ ద్విచక్ర వాహనదారులు, కార్లు, స్కూల్, ఆర్టీసీ బస్సులు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. మండలంలో కొత్తూరు, రామాపురం, బీఆర్టీ కాలనీ, తుమ్మపాల, శంకరం, రేబాక గ్రామాల్లో ట్రాఫిక్ సమస్య నిత్యం ఉత్పన్నమవుతోంది. ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యపై అధికారుల చొరవ చూపి కనీసం ఉదయం, సాయంత్రం సమయాల్లోనైన టిప్పర్ల రాకపోకలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.